
సాక్షి
పల్నాడు
మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



విఘ్నేశ్వరునికి పూజలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు సోమవారం పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.

అరటిపండ్లతో విశేష పూజలు



సత్తెనపల్లి: సత్తెనపల్లి నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అరటిపండ్లతో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణ తలభారం

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఒంటెత్తు పోకడలతో అసంతృప్తి

- పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీలో లుకలుకలు
- ఎంపీ తీరుతో ఎమ్మెల్యేల అసంతృప్తి
- పైకి హుందాతనం.. లోన మోనార్కిజం
- ఎక్కడికక్కడ గ్రూపు రాజకీయాలు
- తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ నేతలు
- వైఎస్ జగన్ అందుకే పక్కన పెట్టారంటున్న తెలుగు తమ్ముళ్లు
- తీరు మారకపోతే పార్టీ కార్యక్రమాలకు పిలవబోమని హెచ్చరికలు

ఆయన నవ్వాడంటే అక్కడ శత్రుత్వపు బీజాలు పడినట్టే.. ఆయన కరచాలనం చేశాడంటే.. అక్కడ కేడర్ మధ్య అడ్డుగోడలు కట్టినట్టే.. ఆయన ఆలింగనం చేశాడంటే అక్కడ గ్రూపులు ప్రారంభమైనట్టే.. ఆయన అడుగు పెట్టాడంటే అక్కడ పార్టీలో లుకలుకలు మొదలైనట్టే.. ఇదీ నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తీరుపై ఆ పార్టీ నేతలు బాహాటంగా చెబుతున్న అభిప్రాయం. పల్నాడులో శ్రీకృష్ణ'తలభారం'తో తెలుగుదేశం పార్టీకి బొప్పి కడుతోంది. అమ్మో ఈ ఎంపీ మాకొద్దు బాబోయ్ అంటూ తలలు పట్టుకుంటోంది.




ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పల్నాడు రాజకీయాల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సరికొత్త భాష్యానికి తెర తీశారు. మామూలుగా పల్నాడు రాజకీయాలంటే ప్రతీకారాలు, ప్రత్యక్ష యుద్ధాలు. కానీ శ్రీకృష్ణదేవరాయలు అడుగుపెట్టాక కొత్త కోణాన్ని పల్నాడు రాజకీయాలకు పరిచయం చేశాడు. ఎక్కడికక్కడ గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోశాడు. తాను అనుకున్నదే జరగాలనే ఒంటెత్తు పోకడలతో కేడర్ మధ్య చిచ్చు పెట్టారు. ఇలా తన రాజకీయ ప్రస్థానంలో పైకి సౌమ్యుడిలా.. లోన కుట్రపూరితంగా రాజకీయాలు చేస్తున్నారు.

వర్గపోరుకు కేరాఫ్..

గతంలో వైఎస్సార్ సీపీ తరఫున నరసరావుపేట ఎంపీగా గెలిచిన లావు శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో వర్గ పోరు కొనసాగించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి రజిని, అప్పటి వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో విభేదాలు ఉండేవి. గురజాలలో కాసు మహేష్‌రెడ్డికి పక్కలో బల్లెంలా మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని ప్రోత్సహిస్తూ వచ్చాడు. ఈ నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా గ్రూప్ రాజకీయాలను పెంచి పోషించాడన్న అపవాదు మూటకట్టుకున్నాడు. మిగిలిన నియోజకవర్గ ఎమ్మెల్యేలతోనూ పైకి స్నేహపూర్వకంగా ఉన్నట్టు నటిస్తూ అంటీముట్టనట్లు వ్యవహరించే వారు. తనకంటూ అన్ని నియోజకవర్గాలలో ప్రత్యేక వర్గాన్ని పెంచి పోషించేవారు.



అందుకే జగన్ పక్కన పెట్టేశారు..

వైఎస్సార్ సీపీలో చేరిన శ్రీకృష్ణదేవరాయలుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత నిచ్చారు. రాజకీయాల్లో యువకులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2019 ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీ సీటు ఇచ్చారు. అక్కడ గెలుపొందిన శ్రీకృష్ణ దేవరాయలు మొదటి నుంచీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. జిల్లా వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని, ఎమ్మెల్యేలంతా తన తర్వాతే అనే ధోరణిలో వ్యవహరించే వారు. ఇది అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఈ విషయాలపై శ్రీకృష్ణదేవరాయలును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నితంగా మందలించారని కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి రజిని బహిరంగంగా చెప్పారు. తాము అధికారంలో ఉండగా శ్రీకృష్ణదేవరాయలు ఫోన్ ట్యాపింగ్ చేశారని, అక్రమాలకు పాల్పడ్డారని మీడియా ముఖంగా మాజీ మంత్రి విడదల రజిని కుండబద్దలు కొట్టారు. దీనిపై స్పందించిన ఎంపీ.. నాలుగు ముక్కలు చెప్పి వేరే విషయాలు మాట్లాడి చేతులు దులుపుకొన్నారని, దీటైన జవాబు ఇవ్వలేకపోయాడని తెలుగుదేశం పార్టీ వర్గాలే పెదవి విరిచాయి. తనను ఎంపీగా గెలిపించిన పార్టీ, ఎమ్మెల్యేలకు మోసం చేయడంతోనే వైఎస్సార్ సీపీ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కన పెట్టేశారని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆ తలనొప్పి మాకు తగులుకుందని వాపోతున్నారు.

టీడీపీలోనూ అదే పంథా..

కూటమి తరఫున లావు శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేట ఎంపీగా రెండోసారి గెలిచారు. ఎన్నికల సమయంలో ఆయా ప్రాంతాల్లోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో గ్రూపు రాజకీయాలు నడిపారు. టీడీపీలోకి చేరే సమయంలోనే ఎమ్మెల్యే టికెట్ల విషయంలో కొన్ని కండీషన్లు పెట్టిమరి కండువా కప్పుకున్నారని సమాచారం. అందులో భాగంగా గురజాలలో జంగా కృష్ణమూర్తిని ప్రోత్సహించి యరపతినేనికి టికెట్ రానీయకుండా పావులు కదిపారనే ప్రచారం నడిచింది.

- నరసరావుపేటలో బీసీ అభ్యర్థి అరవింద్ బాబుకు చివర వరకు బీఫారం రాకుండా అడ్డుకున్నారు. జనసేన నేత జిలాని, కొంతమంది టీడీపీ నేతలతో జట్టు కట్టి అక్కడ కుట్రలకు తెర తీశారు. ఆ సమయంలోనే అరవింద్ బాబు, శ్రీకృష్ణదేవరాయలు మధ్య విభేదాలు పొడచూపి బహిరంగంగా తిట్టుకొనే వరకు వెళ్లాయి. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వైరం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావొస్తున్నా నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదు.
- ఇక చిలకలూరిపేటలో ప్రత్తిపాటి పుల్లారావును కాదని మర్రి రాజశేఖర్ వర్గాన్ని ఆదరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో మర్రి రాజశేఖర్‌కే పేట ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్న ప్రచారంతో పత్తిపాటి వర్గం గుర్రుగా ఉంది.
- వినుకొండలో తనతోపాటు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరిన మాజీ ఎమ్మెల్యే మక్కెనను ఎంపీ ప్రాధాన్యత ఇవ్వడంతో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వర్గం జీర్ణించుకోలేకపోతోంది. గతంలో బొల్లాకు ఇలానే తలనొప్పి తెప్పించారని గుర్తుచేసుకుంటున్నారు.
- మాచర్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి వ్యతిరేకంగా సొంతపార్టీలోనే మరో గ్రూపు కడుతున్నారు. ఈ వర్గం ద్వారా బ్రహ్మారెడ్డికి ఇక్కట్లు తీసుకొస్తున్నారు. వైఎస్సార్ సీపీలో వర్గ రాజకీయాలు చేసిన లావు శ్రీకృష్ణ దేవరాయలు టీడీపీలో చేరిన తర్వాత అదే పంథా కొనసాగిస్తున్నారు. నచ్చిన వారు ఎన్ని తప్పులు చేసినా అందలమెక్కిస్తారని, నచ్చకపోతే వారిని అథఃపాతాళానికి తొక్కుతారనే విమర్శలు ఉన్నాయి.

30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు

నరసరావుపేట ఈస్ట్/నరసరావుపేట: పల్నాడుజిల్లా పరిధిలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల మూడు పట్టణ కేంద్రాల పరిధిలోని 12 పరీక్ష కేంద్రాలలో ఈనెల 30వ తేదీన పాలిసెట్–2025 పరీక్ష నిర్వహిస్తున్నట్టు సెట్ జిల్లా కో–ఆర్డినేటర్ బి.వి.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కేంద్రాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 11గంటల తరువాత వచ్చిన అభ్యర్థులను కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఉదయం 10గంటలకే కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకొని ఉండి హాల్‌టికెట్లు పొందని విద్యార్థులు తమ దరఖాస్తు నకలుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, 10వ తరగతి హాల్‌టికెట్ (ఎస్‌ఎస్‌సీ)తో ఈనెల 29వ తేదీన తమ పరిధిలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల (పల్నాడురోడ్డు, నరసరావుపేట 9398421968), చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాల (గణపవరం, చిలకలూరిపేట, ఎన్.హెచ్ 16, 9912342063), కిడ్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, (కొత్త కేసీపీ కాలనీ, మాచర్ల, 9440613009) కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు.

జీడీసీసీబీ చైర్మన్‌గా మక్కెన



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) చైర్మన్‌గా వినుకొండ నియోజకవర్గానికి చెందిన మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జునరావు 2004 నుంచి 2009 వరకు వినుకొండ ఎమ్మెల్యేగా పనిచేశారు. గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వడ్రాణం హరిబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

ఉచిత ప్రవేశాల దరఖాస్తు తేదీల మార్పు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు మే 2వతేదీ నుంచి మే 19వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈనెల 28వ తేదీ నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రకటించామన్నారు. అయితే కొన్ని ప్రత్యేక కారణాల వలన తేదీలను మార్పు చేస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్టు వివరించారు. మారిన తేదీలను అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు. అలాగే ఎంఈఓ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈమేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

డీపీఓగా ఎస్‌వీ నాగేశ్వర్‌నాయక్

నరసరావుపేట రూరల్: జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్‌వీ నాగేశ్వర్ నాయక్ నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసిన ఎంవీ భాస్కరరెడ్డిని మార్కాపురం డివిజన్ డీడీఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీఓ జారీచేశారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

కోటప్పకొండ ఆలయానికి రూ.1.08 లక్షలు విరాళం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానానికి యల్లమంద గ్రామానికి చెందిన మానుకొండ శివరామకృష్ణ రూ.1,08,000 విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళం చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు అందించారు. ఎమ్మెల్యే ద్వారా విరాళాన్ని ఆలయ ఈఓకి పంపుతామని దాతలు తెలిపారు. కడియాల తాండవకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట: విద్యాహక్కు చట్టం మేరకు విద్యాలయాల్లో ఉచిత ప్రవేశాలపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దీనిలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీఆర్వో ఏకా మురళి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బగళాముఖి అమ్మవారి కొలుపులు

చందోలు(కర్లపాలెం): చందోలులో శ్రీ బగళాముఖి అమ్మవారి వార్షిక కొలుపులు(తిరునాళ్ల) ఈనెల 30వ తేదీ నుంచి మే 5 వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మేనేజర్ నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



కలెక్టరేట్‌లో బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్, అధికారులు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్‌ఎస్‌లో 168 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు అధ్యక్షత వహించి ప్రజల నుంచి 168 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. జేసీ గనోరే సూజర్ ధనుంజయ, డీఆర్‌ఓ మురళి, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలు పక్కాగా అమలు చేయాలి..

విద్యాహక్కు చట్టం మేరకు కార్పొరేట్, ప్రైవేటు 25శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రత్యేక బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేటాయించేలా పక్కాగా చర్యలు తీసుకోవాలి. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలి. లేనిపక్షంలో ఆ విద్యాసంస్థను రద్దుచేయాలి.

– వి.కోటానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

భూ ఆక్రమణను విడిపించండి

గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలకు తూర్పున గల గ్రామకంఠం పోరంబోకుగా ఉన్న గ్రామ సర్వే నెం.216లోని 36.72 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన గోవిందమ్మ, త్రివేణి, సుబ్బారావులు ఆక్రమించి ఇళ్లు కట్టారు. 2009 నుంచి దీనిపై పోరాడుతున్నాను. ఆర్డీఓ విచారించి నిజమేనని తేల్చారు. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆక్రమణదారులకు అండగా ఉంటున్నారు. దయచేసి ఆక్రమణదారుల చెర నుంచి ఈ భూమిని తప్పించి పాఠశాలకు వినియోగిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

–ఆవుల సాంబశివరావు, గణపవరం, నాదెండ్ల మండలం

మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా మదార్ సాహెబ్



మదార్ సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి, మున్సిపల్ చైర్మన్ పోలూరి

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం వైస్ చైర్మన్‌గా టీడీపీకి చెందిన మదార్ సాహెబ్ ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ జి.సూరజ్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికకు 21 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వీరంతా మదార్ సాహెబ్ పేరును ప్రతిపాదించగా, ఏకగ్రీవంగా మదార్‌ను ఎన్నుకున్నారు. మున్సిల్ వైస్ చైర్మన్‌గా మదార్ సాహెబ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

బెదిరింపులు, ప్రలోభాలు..

మాచర్ల పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. నాలుగు సంవత్సరాల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 31 వార్డులు కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒకరి తరువాత మరొకరిని పార్టీ మారాలని అనేక రకాలుగా ఒత్తిళ్లు, ప్రలోభాలాకు గురిచేయడంతోపాటు, గతంలో పెట్టుకున్న బిల్లులు కూడా ఆపుతామని బెదిరించారు. దీంతో మొదట దఫా పది మంది కౌన్సిలర్లు టీడీపీలోకి వెళ్లారు. అనంతరం మరో ఆరుగురిని లాక్కున్నారు. 16 మందితో పది నెలల క్రితం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పోలూరి నరసింహారావును ఎంపిక చేసుకుని, అంతకు ముందు ఉన్న ఇన్‌చార్జి చైర్మన్, వైస్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబుతో రాజీనామా చేయించారు. అప్పటి నుంచి ఒకరితరువాత మరొకరిని బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేస్తూ సోమవారం నాటికి టీడీపీ కూటమి 21 మంది కౌన్సిలర్లను తమ వైపు మల్చుకుని వైస్‌చైర్మన్ గెలిపించుకుని సంబరాలు జరుపుకొన్నారు. మదార్‌సాహెబ్‌ను పలువురు అభినందించారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, మాచర్ల అర్బన్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్పౌజ్ పేరిట కొత్త మెలిక

- వితంతు పింఛన్ అర్థమే మార్చివేసిన కూటమి ప్రభుత్వం
- ఏ దేనీ పింఛన్ పొందుతూ మృతిచెందిన భర్త స్థానంలోనే భార్యకు పింఛన్
- 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య చనిపోయిన వారి భార్యలే దరఖాస్తు చేయాలంటూ మెలిక
- స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్లు మంజూరు

నెహ్రూనగర్: వితంతువులకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా చర్యలు చేపట్టింది. వితంతు పింఛన్ల మంజూరును ఓ తంతుగా మార్చింది. స్పౌజ్ కేటగిరీలోనే పింఛన్లు మంజూరు చేసేందుకు ఏర్పాటు చేస్తోంది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే, అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేసేలా నిబంధనలు విధించింది.

దరఖాస్తులు స్వీకరిస్తే ఒట్టు

కూటమి అధికారం చేపట్టిన తరువాత కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కనీసం అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించిన పాపాన పోలేదు. తాజాగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరు అంటూ అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయితే ఇక్కడా ఓ మెలిక పెట్టింది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతూ భర్త మరణించిన భార్యకు స్పౌజ్ కేటగిరీ పేరుతో పింఛన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. అది కూడా నిర్దిష్ట కాలానికి మాత్రమేనని మెమోలో స్పష్టం చేసింది. ఎవరైనా వ్యక్తి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరీ కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబర్ తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు. ఇక సాధారణంగా ఎటువంటి సామాజిక పింఛన్ పొందని వారి కుటుంబాల్లో భర్త చనిపోయినా వారికి వితంతు పింఛన్ మంజూరు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.



50 ఏళ్లకే పింఛన్ అమలు ఏదీ!

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 2,52,715 మందికి పింఛన్లు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో సుమారు 7వేల దాకా పింఛన్లు ఆగిపోయాయి. ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారని, వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికీ 50 ఏళ్లు నిండిన వారు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

గత ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసింది. 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని పథకాలకు దరఖాస్తు చేయించేవాళ్లు. 35 ఏళ్ల వయస్సు పైబడిన మహిళలకు భర్త చనిపోతే ఆ మరుసటి నెలలోనే వితంతు పింఛన్ అందించేవారు.

కూటమి ప్రభుత్వంలో ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు కాలేదు. పది నెలలుగా దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతువులకు నిబంధనలు విధించడంతో అర్హత కలిగిన వితంతువులు పింఛన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు వారం వారం అర్హులు ప్రభుత్వ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఎదురుచూపులు తప్పేలా లేవు.

ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారు. వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి.

– విజయలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

అక్రమ లే అవుట్లపై కొరడా

తోటవారిపాలెంలో లేఅవుట్ నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్



చీరాల టౌన్: అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులు పడవద్దని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. సోమవారం 'సాక్షి'లో వచ్చిన 'బరితెగించిన భూచోళ్లు' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని తోటవారిపాలెంలో అనధికారికంగా వేసిన లే అవుట్‌ను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. లేఅవుట్‌కు సంబంధించిన భూమి రికార్డులను తనిఖీ చేశారు. అనధికారికంగా, అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. తోటవారిపాలెం సచివాలయం సమీపంలో వంట పొలంలో వేసిన వెంచర్‌కు అనుమతులు లేవని, వీటిలో అమ్మకాలు చేయవద్దని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చీరాల మండలంలోని రూరల్ గ్రామాల్లో అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు కూడా అన్నీ అనుమతులు ఉంటేనే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అనుమతులు లేని ప్లాట్లు కొని ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా వేసిన, వేస్తున్న లేఅవుట్లను క్షుణ్ణంగా పరిశీలనలు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

అర్జీదారులకు అన్నదానం

ఏర్పాటుచేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం



నరసరావుపేట: జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లలో అర్జీలు, ఫిర్యాదులు అందజేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అనేక సమస్యలతో వచ్చేవారికి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి శిఖాకొల్లి రాజేష్ (గుణ రాజేష్), చితిరాల అనిల్ కుమార్ సహకరించారు. కలెక్టర్ కార్యాలయంలో అన్నదానాన్ని జిల్లా జిల్లా ఫారెస్ట్ అధికారి జి.కృష్ణప్రియ ప్రారంభించగా, ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆర్ఐ కృష్ణ ప్రారంభించి దాతలను సన్మానించారు. వారికి నిర్వహణ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, రామకృష్ణ, గౌరు శ్రీనివాసరావు, రెడ్డి మురళికృష్ణ, వనమా ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో మంచి ఫలితాలు సాధించాలి

బల్లికురవ: పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల కోసం మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి మార్కులతో పాటు పర్సంటేజ్ మార్కులు పెంచుకోవాలని సర్వశిక్ష అభియాన్ జీసీడీవో చారులత కోరారు. ఆమె సోమవారం బల్లికురవ, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల శిక్షణ తరగతులను, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. 20 రోజుల పాటు కష్టం పడటంతోపాటు ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యామని బాధపడొద్దని, ఆత్మస్థైర్యంతో చదవాలని సూచించారు. ఆమె వెంట ఎస్ఎస్ఏ ఏఈ షేక్ రాజన్‌బాబు, ఎస్‌వోలు ఉన్నారు.

మోసపోయాం.. ఆదుకోండి !

- విదేశాలకు పంపిస్తామంటూ రూ.15లక్షలు కాజేశారు
- స్టాఫ్ నర్స్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ. 3లక్షల వసూలు
- ఆర్థిక నేరాలపై పలు ఫిర్యాదులు అందుకున్న ఎస్పీ
- పీజీఆర్ఎస్‌లో 73 ఫిర్యాదులు స్వీకరణ



బాధితుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: నా సోదరుడిని విదేశాలకు పంపిస్తామని నమ్మబలికి రూ.15లక్షలు కాజేశారని, రెండేళ్లు గడుస్తున్నా పంపించకుండా మోసం చేశారని పట్టణంలోని పెద్దచెరువు నివాసి నడికుడి పాపారావు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, చోరీలు, మోసం సమస్యలకు సంబంధించి 73 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

నాకు ప్రభుత్వం హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్ ఉద్యోగం ఇప్పిస్తానని విజయవాడకు చెందిన రెడ్డి గౌతమ్, పెద్దపులి శ్రీనివాసరెడ్డి కలిసి రూ.3లక్షలను ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నారు. ఉద్యోగం రాలేదు. దాని గురించి అడగ్గా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని డబ్బులు నాకు ఇప్పించండి.

–కోట సంధ్యారాణి, అడిగొప్పల, దుర్గి మండలం

డబ్బులు ఇవ్వమని అడిగితే బెదిరింపులు

రుద్రవరం గ్రామస్తుడైన అన్నపురెడ్డి అంజిరెడ్డి వందెకరాల మొక్కజొన్న పంట వేస్తానని నా వద్ద నుంచి రూ.5లక్షలు తీసుకున్నాడు. పంట వేయకుండా ఇబ్బంది పెడుతుండటంతో తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడిగాను. దీనికి అతను అసభ్యకరంగా మాట్లాడుతూ.. నీకు దిక్కున చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడు.

–పమ్మి వెంకటరెడ్డి, పసర్లపాడు, రెంటచింతల మండలం

డబ్బులు తీసుకొని అతీగతీ లేదు



నా సోదరుడు ప్రశాంత్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. పట్టణానికి చెందిన టి.హనుమంతరావుతో పరిచయం ఏర్పడింది. నా సోదరుడిని ఇంగ్లిష్ స్ప్రింగ్స్ స్టడీ ఇన్ ఐర్లాండ్ సంస్థ ద్వారా విదేశాలకు పంపిస్తామని రూ.15లక్షలు దఫాల వారీగా కట్టించుకున్నారు. ఇప్పటికీ రెండేళ్లు గడిచినా విదేశాలకు పంపలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడిగితే ప్రాణాలు తీస్తామని, ఎవడికి చెప్పుకుంటావో..చెప్పుకో..పో అంటూ బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–నడికుడి పాపారావు, పెద్దచెరువు, నరసరావుపేట

కొడుకు ఇంటి నుంచి గెంటి వేశాడు



మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహం జరిపించి ఆస్తిని సమానంగా ఇచ్చాం. ఇద్దరం కుమార్తె ఇంట్లో నివాసం ఉంటున్నాం. ఈనెల 25న మా కుమారుడు శాంతిరాజు, అతని భార్య ఇంట్లోకి వచ్చి ఇద్దరిని దుర్భాషలాడారు. ఇంటి నుంచి గెంటి వేసి తాళం వేశారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

–కడియాల వెంకటేశ్వరరావు దంపతులు, ఇక్కుర్తి, నరసరావుపేట మండలం

రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్టీలు

శావల్యాపురం: రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులుగా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ మండిపడ్డారు. మండలంలోని గంటావారిపాలెంలో ఈనెల 19న ఎస్టీ వర్గీయుడైన కుంభా యోగయ్య దుకాణాలను పొక్లయిన్, జేసీబీతో కూల్చివేసి, కులం పేరుతో దూషించిన అగ్రవర్ణాలకు చెందిన కొనకంచి వెంకట్రావు, మురళి, మాదినేని మధుసూదనరావు, గోపు రామకృష్ణ, రావి హరి వెంకట నరసింహారావులపై ఎస్సీ,ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట దళిత, గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనతో పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూరపాటి కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీయులపై దాడులు జరిగిన వెంటనే గ్రామాన్ని సందర్శించి వారికి మనోధైర్యాన్ని నింపాల్సిన కలెక్టరు, ఎస్పీలు 10 రోజుల గడుస్తున్నా ఇప్పటి వరకు రాకపోవడం చట్టాలను అపహస్యం చేయటమేనని తెలిపారు. ఈ కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, బాధితులను భయపెడుతున్న ఎస్ఐ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం తహసీల్దారు యం.అర్జున్‌నాయక్‌కు వినతిత్రం అందజేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఓర్సు శ్రీనివాసరావు, జక్కా బ్రహ్మయ్య, చలంచర్ల అంజి, ఖాశీం, కుంభాల పోతురాజు, ఏడుకొండలు, సీపీఐ నాయకులు జె.కృష్ణానాయక్, వివిధ సంఘాల నేతలు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



పోటీల్లో బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి: రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. నాలుగు పళ్ల విభాగంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన గాదె ఆషేర్ సుమణ్విరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు, తుర్లపాడుకి చెందిన పోపూరి ఆదినారాయణ సంయుక్త ఎడ్లజత 5,059 అడుగుల దూరం బండ లాగి మొదటిస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగరేవుల గ్రామానికి చెందిన పెరుమళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత 4,932 అడుగుల దూరం లాగి రెండవ స్థానం, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకి చెందిన మోపర్తి నవీన్‌కుమార్ చౌదరి ఎడ్లజత 4,500 అడుగుల దూరం లాగి మూడవ స్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన కావ్యనంది బ్రీడింగ్‌బుల్స్ సెంటర్ నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 4,432 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విస్సపాలేనికి భాష్యకారెడ్డి, జ్ఞాన్విత్ రెడ్డి ఎడ్లజత 4,312 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరానికి చెందిన పసుమర్తి దివ్యశ్రీ ఎడ్ల జత 3,850 అడుగుల దూరం లాగి ఆరవ స్థానం, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకి చెందిన ఏలూరి లిఖిత చౌదరి ఎడ్లజత 3,750 అడుగుల దూరం లాగి ఏడవ స్థానం, బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం యద్దనపూడికి చెందిన మేస్త్రీ ఖాదర్‌మస్తాన్ ఎడ్ల జత 3,316 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో నిలిచాయి.విజేతలైన ఎడ్ల జతల రైతులకు దాతలు బహుమతులు, నగదు ప్రదానం చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, యలమల నరేష్, అనిశెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, కానుకొల్లు ప్రశాంత్ పర్యవేక్షించారు.

మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరిన మునుమాక గ్రామస్తులు



చెక్ డ్యామ్ మట్టి కట్టల తవ్వకం

నరసరావుపేట: మూడు గ్రామాల్లోని వందల ఎకరాలకు సాగునీటి కోసం నిర్మించిన చెక్ డ్యామ్ చుట్టూ వేసిన మట్టి కట్టలను అక్రమంగా తరలించుకుపోతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మునుమాక గ్రామస్తులు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో సయ్యద్ కరిముల్లా, అన్వర్‌బాషా, జిలాని, షాజహాన్, జాన్‌సైదా, మస్తాన్‌వలితో పాటు పలువురు గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి అర్జీ అందజేశారు. కోటప్పకొండకు సమీప గ్రామాలైన కొండకావూరు, అరవపల్లి, మునుమాక గ్రామాల్లోని పొలాలకు అవసరమైన సాగునీటి కోసం మునుమాక వద్ద ఓగేరు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మించారని తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన పొలాలు కాలువ చివరి భూములు కావడంతో డ్యామ్ అవసరమైందని చెప్పారు. ఇటీవల కొందరు మట్టి దొంగలు డ్యామ్‌కు రక్షణగా ఉన్న మట్టికట్టలను తవ్వి తరలించుకుపోతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. దీని వల్ల డ్యామ్‌కు రక్షణ లేకుండా పోయిందని, వరదల సమయంలో కొట్టుకొనిపోయే ప్రమాదం పొంచి ఉందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో పాటు పంట భూములు కోతకు గురయ్యే అవకాశం కూడా ఉందని, వందల ఎకరాలు బీడు భూములుగా మారి రైతులు జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. అక్రమ మట్టి తరలింపును అరికట్టి చెక్‌డ్యామ్‌ను కాపాడాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



తీవ్ర గాయాలతో జ్యోత్స్న



అక్షయ మృతదేహం

అచ్చంపేట: ఎదురుగా వస్తున్న బైక్‌ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని చెరుకుంపాలెం ఆర్ అండ్ బీ రోడ్డు మలుపులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడువాయికి చెందిన వేమవరపు ప్రకాష్ మంగళవారం గ్రామంలో జరిగే చర్చి ప్రారంభోత్సవానికి కస్తలలో ఉంటున్న సోదరి జ్యోత్స్నతో పాటు కూతురు అక్షయ (2)ను తీసుకుని బైక్‌పై తీసుకుస్తుండగా ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొట్టడంతో చిన్నారి అక్షయ కిందపడి అపస్మారకస్థితికి వెళ్లింది. వెంటనే సమీపంలోని వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉదయాన్నే కుమార్తె అక్షయతో కలసి కస్తల వెళ్లిన ప్రకాష్ తిరుగు ప్రయాణంలో ఇలా జరగడం దురదృష్టకరం. జ్యోత్స్నకు కుడికాలు, కుడి చేయికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కనున్న మరో మహిళ మహిమ కూడా మోస్తరు గాయాలవ్వడంతో అంబులెన్స్‌లో సత్తెనపల్లి తరలించారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఇద్దరు మహిళల ఘర్షణ

నగరంపాలెం: ఫిర్యాదుదారులైన ఇద్దరు మహిళలు ఒకరిపై ఒకరు కొట్లాటకు దిగారు. నగరంపాలెం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణ (డీపీఓ)లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ఈ ఘటన జరిగింది. ఈ సంఘటన పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు రూరల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ప్రజా ఫిర్యాదులు- పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్) ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. గత సోమవారం కూడా వచ్చిన ఆమె పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు. అయితే సోమవారం వచ్చిన ఆమె సమావేశ మందిరంలో ఫిర్యాదు చేసేందుకు బయట కుర్చీలో వేచి ఉన్నారు. ఈ లోగా పాతగుంటూరులోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళ వేచియున్న మహిళ వద్దకు వచ్చింది. ఇద్దరు వాగ్వివాదం చేసుకున్నారు. ఒకనొక దశలో ఇద్దరు జుట్లు పట్టుకుని తన్నుకుని గొడవకు దిగారు. ఈలోగా పెద్దగా కేకలు వినిపించడంతో అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది వచ్చి ఇద్దరి బాధిత మహిళలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం ఆమె సమావేశం మందిరంలోని పోలీస్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసి వెనుదిరిగారు. తర్వాత పాతగుంటూరుకు చెందిన మరో మహిళ అర్జీ రాసుకుని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వీరిద్దరి మధ్య గొడవలో ఓ పోలీస్ అధికారి ప్రమేయం ఉన్నట్లు పోలీస్ శాఖలో చర్చించుకుంటున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, పాఠకులు రోజులో కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడిపి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో భద్రపర్చిన పురాతన గ్రంథాలు చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు, పాఠకుల సంఖ్య తగ్గిపోతోందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్ , డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, జీకే తదితర అంశాల్లో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీకే సుజాత, పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్. దీక్షితులు, జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ మల్లంపాటి సీతారామయ్య, విశ్రాంత గ్రంథ పాలకుడు ఎస్ఎం సుభాని, అధ్యాపకుడు శివారెడ్డి, మహిళా బాలల గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా బందా

పట్నంబజారు: పదవీ విరమణ తమ బాధ్యతలు ముగిశాయని కాకుండా, సామాజిక సేవతో పది మందికి మేలు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషనన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అందుకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) విశ్రాంత ఉద్యోగుల నడవడికే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని మల్లేశ్వరి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఈమేరకు ఎన్నికలు నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన ఆలిండియా వైస్ చైర్మన్ ఏఎస్ రామారావు, తాడేపల్లి గూడేనికి చెందిన కె సుధాకరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. బందా రవీంద్రనాథ్‌తోపాటు రాష్ట్ర వైస్ చైర్మన్‌గా రాజమండ్రికి చెందిన కె.నాగేశ్వరరావు, కార్యదర్శిగా భీమవరానికి చెందిన జి. గోపాలరావు, సహాయ కార్యదర్శిగా విజయవాడకు చెందిన ఆర్. సాయిబాబు, కోశాధికారిగా పశ్చిమ గోదావరికి చెందిన డి మురళీమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా చైర్మన్‌గా పి. యలమంద, కోశాధికారిగా ఎస్.ప్రభాకరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ 1990 నుంచి యూనియన్ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనేక హోదాలలో పనిచేస్తూ 2022లో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా ఎంపికైనట్లు చెప్పారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో తనను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్న విశ్రాంత ఉద్యోగులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు నల్లయ్య, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అటు మట్టి దందా..ఇటు ఆక్రమణలు

లాంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమాలు



లాంలో కొండపోరంబోకులో మట్టితో పూడ్చి ఆక్రమించిన టీడీపీ నాయకులు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో ఓ వైపు మట్టి దందా, మరో వైపు స్థలాల వరుస ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ప్రశ్నించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువును చెరబట్టి రూ.కోట్ల విలువైన మట్టిని అమ్ముకొని జేబులు నింపుకొంటున్న తెలుగు తమ్ముళ్ళు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఆక్రమణల పర్వానికి తెరలేపారు. కొండ పోరంబోకులో మట్టిని తోలి చదును చేసుకొంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణల పర్వం మరింతగా పెరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

– లాం నుంచి జొన్నలగడ్డ వెళ్లే ప్రధాన రహదారిలో టీడీపీ నాయకులు కొండను మింగేసి మట్టిని తోలి పూడ్చివేసి ఆక్రమణల పర్వానికి తెరలేపారు. టీడీపీ అధికారంలోకి రాగానే కక్షపూరితంగా జానెడు జాగాలో ఇళ్ళు నిర్మించుకొని నివసిస్తున్న పేదల ఇళ్లను 40కి పైగా పొక్లెయిన్లతో కూల్చారు. మరి కొంత మందికి నోటీసులిచ్చి, తమకు సహకరించాలని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. వీరి దుర్మార్గ వ్యవహారాలకు సహకరిస్తున్న అధికారులు సామాన్యులను మాత్రం వేధింపులకు గురిచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణల పర్వానికి తెరదించాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన శ్రీ గోదా కల్యాణం నృత్య నాటిక



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీమహా మంజీర నాదం సోమవారం ఆరో రోజుకి చేరింది. ఆలయ ప్రధాన కార్యదర్శి పుట్టగుంట ప్రభాకర్‌రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. అనంతరం సీనియర్ మేకప్‌మేన్ ఆచారి (పసుపులేటి మద్దిలేటి)కి అపురూప రూపశిల్పి బిరుదుతో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం సత్కరించారు. శ్రీగోదా కల్యాణం నృత్య నాటిక ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో మానం బ్రహ్మయ్య, తాళ్లూరి ధరణి, తాళ్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.



